ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
03-02-2025
సోమవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 141 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



## ఇందిరమ్మ ఇండ్ల పథకంపై
# కేంద్ర బడ్జెట్ ప్రభావం

**తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సాయం పెరుగుతుందని ఆశించింది. కానీ ఈసారి కేంద్ర బడ్జెట్‌లో ఇళ్లకు కేటాయింపులు తగ్గాయి. ఈ ప్రభావం తెలంగాణ ఇందిరమ్మ ఇండ్ల పథకంపై పడనుంది.**

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికలకు ముందు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేయాలని, లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటించాలని ప్రభుత్వం భావించింది. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కేంద్రం భారీగా నిధులు కేటాయిస్తుందని ఆశించింది. కానీ.. ఆశించిన స్థాయిలో కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. పైగా తగ్గించారు. దీని ప్రభావం ఇందిరమ్మ ఇండ్ల పథకంపై పడనుంది. దీనికి సంబంధించిన 10 ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.

**10 ముఖ్యమైన అంశాలు..**

1.కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద.. పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఇళ్లకు కేటాయింపులు తగ్గాయి. దీని ప్రభావం తెలంగాణలోని ఇందిరమ్మ ఇండ్ల పథకంపై పడనుంది.

2.తెలంగాణకు రావాల్సిన కేంద్ర వాటా నిధులు తగ్గనున్నాయి. పీఎంఏవైలో ఒక్కో ఇంటికి పట్టణాల్లో అయితే.. రూ.1.50 లక్షలు, గ్రామాల్లో అయితే రూ.72 వేల చొప్పున కేంద్రం ఇస్తోంది.

3.202425లో ఈ పథకం కింద తెలంగాణకు 25 వేల ఇళ్లను మంజూరు చేసింది. 202526లో 2 లక్షల ఇళ్లనైనా కేటాయించాలని ప్రభుత్వం కోరింది.

4.పట్టణాల్లో నిర్మించే ఇళ్లకు కేంద్రం నుంచి అధికంగా నిధులు వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం భావించింది.

5.ఇటీవలే 19 ప్రాంతాలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలోకి తీసుకొచ్చింది. 2024 25 బడ్జెట్‌లో పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి రూ.30,171 కోట్లను కేటాయించారు.

6.ఈసారి బడ్జెట్‌లో రూ.19,794 కోట్లను మాత్రమే కేటాయించారు. కేటాయింపులు తగ్గిన నేపథ్యంలో.. కేంద్రం తెలంగాణ పట్టణాలకు ఎన్ని ఇళ్లను మంజూరు చేస్తుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

2 లో

## ఢిల్లీ పీఠంపై
# బీజేపీ జెండా ఎగరాలి
### అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు పిలుపు




**ఢిల్లీ పీఠంపై బీజేపీ జెండా ఎగరాలని, బీజేపీ అభ్యర్థుల గెలుపునకు తెలుగు ప్రజలు కృషి చేయాలని ఏపీ సీఎం, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ప్యాలెస్‌లు కట్టుకునేవారిని కాకుండా... ప్రజల కోసం పనిచేసేవారికి ఓటేయాలని బాబు ఓటర్లకు సూచించారు.**

**జయభేరి, ఢిల్లీ :**

ఏపీలో జగన్ రుషికొండ ప్యాలెస్ కడితే ఢిల్లీలో కేజ్రీవాల్ శేషమహల్ నిర్మాణం చేపట్టారని, ప్యాలెస్‌లోకి అడుగుపెట్టక ముందే జగన్‌ను ఏపీలో చిత్తుగా ఓడించారని... ఇక్కడా అదే జరగాలని, ఢిల్లీ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగువారు ఏకపక్షంగా బీజేపీకి ఓటేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సంజయ్ గోయల్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బిజెపి అభ్యర్థి సంజయ్ గోయల్‌కు ఓటేయాలని ఓటర్లకు సూచించారు. పదేళ్లకుపైగా అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ ఢిల్లీ ప్రజలకు కనీసం

...మిగతాది 2 లో

# ఏ క్షణమైన ప్రకటన రావొచ్చు
### ఫిబ్రవరి 15లోపు పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**ఫిబ్రవరి 15లోపు పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కులగణన సర్వే రిపోర్ట్ సిద్ధం కావడంతో కేబినెట్ లో చర్చించి రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. అనంతరం పంచాయతీ ఎన్నికలకు వెళ్లనుందని సమాచారం.**

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ పంచాయతీ ఎన్నికలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిబ్రవరి 15లోపు పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయన...కాంగ్రెస్ కార్యకర్తలతో మాట్లాడారు. ఎన్నికలు వస్తున్నాయి, జాగ్రత్త అంటూ కార్యకర్తలకు సూచనలు చేశారు. పంచాయతీ ఎన్నికల ప్రకటన కోసం క్షేత్రస్థాయిలో నాయకులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పార్టీలు, స్థానిక నేతలు ప్రచార కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఏ క్షణమైన ప్రకటన రావొచ్చన్న సమాచారంతో ఎన్నికలకు సన్నద్ధం అవుతున్నారు.

...మిగతాది 2 లో



## వరుసగా రెండోసారి అండర్19 మహిళల ప్రపంచ కప్

వరుసగా రెండోసారి అండర్19 మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకున్న టీమిండియా జట్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఫైనల్ మ్యాచ్ లో అద్భుతమైన ఆటతో టీమిండియా అమ్మాయిల జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషని ప్రత్యేకంగా ప్రశంసించారు. మలేషియా వేదికగా జరిగిన U19వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ లో సౌతాఫ్రికాపై విజయం సాధించి ఇండియా విశ్వ విజేతగా నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన త్రిష ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచారు. దూకుడుగా ఆడి చివరి వరకు నిలబడి సత్తా చాటారు. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచారు. గొంగడి త్రిష లాంటి క్రీడాకారులు తెలంగాణ రాష్ట్రానికి గర్వ కారణమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.


# తెలంగాణకు తీవ్ర అన్యాయం
### కేంద్ర బడ్జెట్ బడా కార్పొరేట్ల కోసమే



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025, 26 బడ్జెట్ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను కాపాడేందుకు ఉపయోగపడుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు విమర్శించారు. బడ్జెట్ లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు . ఆదివారం సంగారెడ్డి పట్టణంలో జరిగిన నిరసన, దీక్ష

...మిగతాది 2 లో

# అమృత స్నానాలకు వెళుతున్న సాధువులు
### కట్టుదిట్ట భద్రత మధ్య మహా కుంభమేళాలో మూడొవ అమృత స్నానం



ఉత్తర్ ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా 2025లో భాగంగా సోమవారం తెల్లవారుజామున అఖాడాలు మూడొవ 'అమృత్ స్నాన్'ని ప్రారంభించారు. గత శుభ స్నానం రోజున ఘోరమైన తొక్కిసలాట

...మిగతాది 2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

## ఇందిరమ్మ ఇండ్ల పథకంపై కేంద్ర బడ్జెట్ ప్రభావం

7.గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే ఇళ్లకు ఈ బడ్జెట్‌లో ఎక్కువ నిధులను కేటాయించారు. 202526లో రూ.54,832 కోట్లు ప్రతిపాదించగా.. 202425లో రూ.32,426 కోట్లుగా కేటాయింపులు జరిగాయి.

8.202425 సంవత్సరంలో తెలంగాణకు ఈ పథకం కింద ఇళ్లను మంజూరు చేయలేదు. కానీ వచ్చే సంవత్సరం లక్ష వరకు గ్రామీణ ఇళ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

9.ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0లో భాగంగా.. పేద, మధ్య తరగతి ప్రజలు ఇళ్ల నిర్మాణ రుణాల ద్వారా కట్టుకునే వాటికి వడ్డీ మాఫీ కోసం బడ్జెట్‌లో నిధులను పెంచారు.

10.ఈసారి కేంద్ర బడ్జెట్‌లో రూ.3,500 కోట్లను మాఫీ కోసం కేటాయించారు. దీని ద్వారా తెలంగాణలో 2 లక్షల మందికి దీని లబ్ధిపొందే అవకాశాలు ఉన్నాయి.

## ఢిల్లీ పీఠంపై బీజేపీ జెండా ఎగరాలి

స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వలేకపోయిందని దేశం మొత్తం స్వచ్ఛ భారత్‌లో దూసుకుపోతుంటే ఢిల్లీ మాత్రం మురికి కూపంలోకి వెళ్లిపోతోందన్నారు. ఢిల్లీలో వాతావరణ కాలుష్యంతో పాటు పొలిటికల్ పొల్యూషన్ కూడా ఉందని 1995లో హైదరాబాద్ ఉన్నట్లు ఇప్పుడు ఢిల్లీ కూడా ఉందని అభివృద్ధి రాజకీయాలు, జీవన ప్రమాణాలు పెరగాలంటే కమలం గుర్తును గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఊపిరి పీల్చుకోవాలంటే మోదీ ఆక్సిజన్ కావాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీలో బీజేపీ అభ్యర్థుల తరపున తెలుగు ఓటర్లు ఉండే ప్రాంతంలో ప్రచారం చేశారు. తెలుగు ప్రజలను ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

'ఢిల్లీలో ఇంతమంది తెలుగువారు ఉంటారని అనుకోలేదని ఢిల్లీలో స్థిరపడ్డ ప్రతి తెలుగు ఓటరు బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని తెలుగువారు ఢిల్లీలోనే కాదు... ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారు ఇది భారతీయులు, తెలుగువారి సత్తా. పెట్టుబడుల కోసం ఇటీవల దావోస్ వెళ్లినప్పుడు 650 మంది అక్కడ ఉన్నారు. ఏఐ, గ్రీన్ ఎనర్జీని ప్రధాని మోదీ ప్రమోట్ చేస్తున్నారు. 1995లో ఐటీ గురించి మాట్లాడాను... ఇప్పుడు ఏఐ గురించి మాట్లాడుతున్నాను. ఢిల్లీలోని ప్రజలు, ప్రత్యేకంగా తెలుగు తమ్ముళ్లు, చెల్లెల్లు ఇంటింటికెళ్లి బీజేపీ గెలుపు.. దేశ చరిత్రకే ఒక మలుపు అని చెప్పాలని సూచించారు. దేశానికి యువత పెద్ద ఆస్తి అని సరైన సమయంలో మన దేశానికి సరైన నాయకుడిగా మోదీ ఉన్నారని మన దేశ బ్రాండ్ మార్మోగడానికి కారణం ప్రధాని మోదీ. 11 ఏళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణల్లో దేశాన్ని శరవేగంతో ముందుకు తీసుకెళ్తున్నారు. వికసిత్ భారత్‌లో భాగంగా 2047 కల్లా దేశం నెంబర్ వన్ అవుతుందన్నారు. ఢిల్లీలో డబుల్ ఇంజిన్ సర్కారు వచ్చి ఉండుంటే వాషింగ్టన్, న్యూయార్క్‌ను ఢిల్లీ తలదన్నేదని ఉద్యోగాల కోసం ఇక్కడి నుంచి చాలామంది హైదరాబాద్, బెంగళూరు వెళ్లాలని చూస్తున్నారు. దీనికి కారణం ఇక్కడి పాలకులు అని ఆరోపించారు. 'ఢిల్లీ అభివృద్ధి కావాలంటే బీజేపీ అధికారంలోకి రావాలి. ఈ దేశానికి రాజధాని అయిన ఢిల్లీ సమస్యల వలయంలో చిక్కుకుపోయి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని పదేళ్లు ఏం చేశారని అడిగితే స్కూళ్లు పెట్టామన్నారు. చదివిన వారికి ఉద్యోగాలు వచ్చాయా..? ఉద్యోగాలకు బెంగళూరు, హైదరాబాద్ వెళ్లడానికి కారణం ఇక్కడి పాలకులు. దేశం స్వచ్ఛ భారత్ వైపు దూసుకెళ్తుంటే.. ఢిల్లీ మాత్రం మురికి కూపంగా మారుతోందన్నారు. సరైన నీటి పైపులైన్లు లేక తాగునీరు కలుషితమౌతోంది. ఒక్కప్పుడు బీహార్ నుంచి ఇక్కడికి ఉపాధికి వచ్చేవారు... కానీ ఇప్పుడు దక్షిణ భారతదేశం వెళ్తున్నారు. అభివృద్ధి జరిగిన చోటకు వలసలు ఉంటాయన్నారు. 'ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తుంది. హోలీ, దీపావళి పండుగకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇవ్వడంతో పాటు రూ.500కు సిలిండర్ అందిస్తుంది. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా పేదల వైద్యం కోసం రూ.5 లక్షలు, వృద్ధాప్య పెన్షన్లు రూ.2,500, వితంతువు, దివ్యాంగులకు రూ.3 వేలు ఇస్తుంది. కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అందిస్తుంది. గరీబ్ కళ్యాణ అన్న కింద 5 కేజీల బియ్యం ఉచితంగా ఇస్తుందని చెప్పారు. 'ఢిల్లీ వాసులకు తాగునీరు అందించడంలో ఆప్ ప్రభుత్వం విఫలమైందని ప్రధాని అమృత్ కింద ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు ఇచ్చేందుకు మోదీ సంకల్పించారని కేంద్రం ఇచ్చే సబ్సీడీని కూడా అసమర్థ ప్రభుత్వం వినియోగించుకోలేదన్నారు. అధికారంలో బీజేపీ ఉండుంటే మోదీ నాయకత్వంలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఢిల్లీ స్వచ్ఛంగా ఉంటుంది. యమునా నదిని శుద్ధి చేస్తానని కేజ్రీవాల్ ప్రగల్భాలు పలికారు...పదేళ్లులో చేయలేని వారు ఇప్పుడు చేస్తారా.? మోదీ నాయకత్వంలో గంగానది ప్రక్షాళన జరుగుతోందన్నారు. 'ఏపీలో రుషికొండ ప్యాలెస్ కట్టారు. ఆ ప్యాలెస్‌లోకి ప్రవేశించేలోపే జగన్ ఇంటికి వెళ్లారని ఢిల్లీలో కూడా కేజ్రీవాల్ బ్రహ్మాండమైన శేషమహల్ కట్టారు. ఆ శేషమహల్‌లోకి ప్రవేశించడానికి ముందే మీరుచిత్తుగా ఓడించాలి. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు అన్నారు. ఒకప్పుడు దేశ విభజనను సర్దార్ వల్లాభాయ్ పటేల్ అడ్డుకుని ఏకం చేశారు. అటువంటి గట్టి నాయకుడు మోదీ టీం ఇండియా నినాదంతో ప్రపంచంలో నెంబర్ వన్‌గా చేయాలని పని చేస్తున్నారు. తెలుగువారు ఎక్కడున్నా ఒక్కటిగా ఉండాలి. మీకు అండగా, తోడుగా నేనుంటా.' అని సీఎం చంద్రబాబు అన్నారు.

## ఏ క్షణమైన ప్రకటన రావొచ్చు

కులగణన చేపట్టాకే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని కాంగ్రెస్ నేతలు ముందు నుంచీ చెబుతున్నారు. తాజాగా కులగణన సర్వే నివేదిక సిద్ధమైంది. ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీ కులగణన సర్వే రిపోర్టును అందుకుంది. కులగణన సర్వే వివరాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ నెల 4న జరిగే కేబినెట్ సమావేశంలో కులగణన నివేదికపై చర్చించనున్నారు. ఈ నెల 5న అసెంబ్లీలో ఈ రిపోర్ట్ ను ప్రవేశపెట్టనున్నారు. అనంతరం బీసీ రిజర్వేషన్ల పెంపుపై తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. అనంతరం రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకొని ఫిబ్రవరి చివరి వారంలో లేదా మార్చి మొదటి వారంలో పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలనే ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇటీవల పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమగ్ర కుటుంబ సర్వేపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పంచాయతీ ఎన్నికల అంశం చర్చకు వచ్చింది. ఎన్నికలకు సన్నద్ధంగా ఉన్నామని పంచాయతీరాజ్, ఎన్నికల సంఘం అధికారులు ప్రభుత్వానికి తెలిపినట్లు సమాచారం. పంచాయతీ ఎన్నికల నగారా ఎప్పుడైనా మోగించవచ్చన్న సంకేతాలతో.. అధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు. ఫిబ్రవరిలో ఎన్నికలు ఉంటాయనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఓటరు జాబితాను గ్రామాలు, వార్డుల వారీగా సిద్ధం చేశారు. ఒక వైపు కొత్త ఓటర్ల పేర్లను వార్డుల వారీగా నమోదు చేస్తుండగా.. మరోవైపు ఓటరు బ్యాలెట్ పత్రాల ముద్రణకు కసరత్తు ప్రారంభించారు. బ్యాలెట్ పత్రాల ముద్రణకు అందుకు కావాల్సిన పేపర్లను అధికారులు సరఫరా చేస్తుండగా.. దానిపై గుర్తులు మాత్రం ప్రైవేటు ప్రింటింగ్ ప్రెస్‌లలో ముద్రించాలని భావిస్తున్నారు. పోటీలో ఉండే అభ్యర్థులు నలుగురు, అయిదుగురు, పది మంది ఉన్నట్లు.. ఇలా గుర్తులతో ముందస్తుగానే ముద్రించుకొని సిద్ధంగా ఉంచాలా లేక అభ్యర్థులు బరిలో ఉన్నట్లు తేలాక ముద్రించాలా అనేదానిపై చర్చలు జరుగుతున్నాయి.

## పంటపొలాలపై ఏనుగు ల స్వైర విహారం

✍ జయభేరి, తిరుపతి:

చంద్రగిరి నియోజకవర్గం, యర్రావారిపాలెం మండలం కోటకాడపల్లి పంచాయతీ అయ్యగారిపల్లె కు చెందిన ఉప్పు జయనరసింహులు మరియు కొంతమంది రైతుల కు చెందిన 4 ఎకరాలు వరిపొలం ను తొక్కి నాశనం చేసాయి. రైతుపొలం పంటపెట్టాలంటే మొత్తం భారీగా పెట్టుబడితో కూడుకున్నవిషయం. అలాంటిది ఏనుగులు పంటనాశనం చేయడం తో రైతుల ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నారు. ఏనుగుల సంచారం ఉండటం తో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని అధికారులు సూచించారు. ఏనుగు లు వున్నచోటుకి ఎట్టిపరిస్థితి లో వెళ్ళకూడదని తెలిపారు. ఏనుగు ల దగ్గర కు వెళ్లి తరిమె ప్రయత్నం చేస్తే ప్రతిఘటించి ప్రాణనష్టం కలిగించే అవకాశం ఉంది జాగ్రత్త గా ఉండాలని ల విజ్ఞప్తి చేసారు.

# తూకంలో తగ్గించి ధరల్లో మాయాజాలం

**ముణ్ణాళ్ల ముచ్చటగా వంట నూనెల సబ్సిడీ.. మళ్లీ పెరిగిన ధరలు.. వంట నూనెల ధరల నియంత్రణ ముణ్ణాళ్ల ముచ్చటగా మారింది. సివిల్ సప్లైస్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గత ఏడాది ఆకస్మిక తనిఖీల పేరుతో చేసిన హంగామా అటకెక్కింది. మార్కెట్‌లో వంట నూనెల ధరలు మళ్లీ మొదటికి వచ్చాయి. సన్న బియ్యం ధరల బాటలోనే వంట నూనెల ధరలు కూడా పైకి ఎగబాకుతున్నాయి.**



ఏపీలో వంట నూనెల ధరల నియంత్రణకు చేపట్టిన చర్యలు ముణ్ణాళ్ల ముచ్చటగా మారాయి. ఇప్పటికే మిల్లింగ్ ధరలకే సన్న బియ్యం విక్రయాలు మాయం కాగా తాజాగా వంట నూనెల ధరల నియంత్రణను కూడా ఎత్తేశారు. వంట నూనెల ప్యాకింగ్ యూనిట్లు, హోల్‌సేల్ వ్యాపారులను ఒప్పించి తగ్గింపు ధరలకు చేపట్టిన విక్రయాలు ఎక్కడా కనిపించడం లేదు. ధరల తగ్గింపులో వ్యాపారుల మాయాజాలం వెలుగులోకి వచ్చింది.

రిఫైండ్ ఆయిల్, పామాయిల్ ధరలపై గరిష్ట ధరల్ని నిర్ణయించి వాటిని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఆదేశించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన ధరలతో వంట నూనెలు విక్రయించాలని వ్యాపారులను మంత్రి నాదెండ్ల అప్పట్లో ఆదేశించారు.

శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ఒకే రకమైన ధరల్ని అమలు చేస్తున్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల అప్పట్లో చెప్పారు. ఏపీలో ఇప్పుడు ఎక్కడా ఆ ధరలతో విక్రయాలు జరగడం లేదు. రిఫైండ్ ఆయిల్ ధర రూ.150, 160 మధ్యలో విక్రయిస్తున్నారు.

శ్రీకాకుళంలో ఉన్న ధరలనే చిత్తూరులో కూడా ఉండాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల అప్పట్లో వ్యాపారులకు ఆదేశించారు. వంటనూనెల అమ్మకంలో వ్యత్యాసం లేకుండా ఒకే ధరకు అమ్మకం జరపాలని సివిల్ సప్లైస్ శాఖ ఆదేశించింది. వంట నూనెల సప్లయర్స్, డిస్ట్రిబ్యూటర్లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వర్తకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రతి రేషన్ కార్డుపై రిఫైండ్ ఆయిల్‌ను గరిష్టంగా రూ.124కు, పామాయిల్‌ను రూ.110కు విక్రయించాలని నిర్ణయించారు. ప్రతి ఇంటికి రేషన్ కార్డుపై నెలకు సరిపడా వంట నూనెను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని నిర్ణయించారు. దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేసుకన్నారు.

రాష్ట్రంలోని కోటి 49లక్షల కుటుంబాలకు రేషన్ కార్డు సదుపాయం ఉండటంతో వారికి సబ్సిడీ ధరలపై వంట నూనె అందుతుందని చెప్పారు. రేషన్ కార్డులు లేని కుటుంబాలకు సబ్సిడీ ధరలతో నూనెలు విక్రయించాలని మాల్స్‌ను ఆదేశించారు. వంట నూనెల ధరల నియంత్రణ, కృత్రిమ కొరత, నిల్వలను దాచి పెట్టడం వంటి చర్యలపై కఠినంగా





వ్యవహరిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ప్రభుత్వ ప్రకటనలు, చర్యలు కంటి తుడుపు చర్యలుగా మిగిలిపోయాయి.

**ధర తగ్గింపులో అదే కిటుకు..**

వంట నూనెల ధరల తగ్గింపులో కిటుకును హోల్ సేల్ వ్యాపారులు బయటపెట్టేశారు. ప్రభుత్వం బలవంతం చేయడంతో కొన్నాళ్ల పాటు తగ్గింపు ధరలతో విక్రయాలు జరిపారు. అదే సమయంలో ఆ నష్టం తమపై పడకుండా ఆయిల్ కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు జాగ్రత్త పడ్డారు. సాధారణంగా కిలో వంట నూనెను లీటర్లలో కొనుగోలు చేస్తే లీటర్లకు దాదాపు 910 గ్రాముల నూనె ప్యాక్ చేయాల్సి ఉంటుంది.

సబ్సిడీ ధరల ప్యాకింగ్‌లో దాని బరువు 860గ్రాములకు తగ్గించేశారు. వంట నూనెల్ని లీటర్ ప్యాకెట్‌లో పామాయిల్‌ను 860870 గ్రాములకు పరిమితం చేసి విక్రయించారు. ఇలా కొంత కాలం విక్రయించిన తర్వాత అంతా మర్చిపోయారనుకుని మళ్లీ పాత ధరలతో వంట నూనెల విక్రయాలు ప్రారంభించారు. సివిల్ సప్లైస్ హడావుడి తగ్గిపోవడంతో మళ్లీ మార్కెట్‌లో ధరలు పెరుగుతున్నాయని విజయవాడకు చెందిన హోల్ సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

## తెలంగాణకు తీవ్ర అన్యాయం

బొమ్మ దగ్ధం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బడ్జెట్ బడా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను కాపాడే విధంగా ఉందని చుక్కా రాములు విమర్శించారు. సామాన్య ప్రజలకు నేరుగా లబ్ది కల్పించేందుకు ఎలాంటి చర్యలు లేవని అన్నారు. వేతన జీవులను పెద్దఎత్తున సంతృప్తి పరుస్తామంటూ గొప్పలు చెప్పి ముష్టి వేసినట్టు ఊరట కల్పించారని విమర్శలు చేశారు. దేశ ప్రజల బడ్జెట్ అంటూ ప్రధాని మోదీ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలున్నా రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టలేక పోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర విభజన హామీలను గాలికొదిలేశారని పేర్కొన్నారు.

**తెలంగాణకు అన్యాయం**

రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐఐఎం, హైస్పీడ్ రైల్వే ట్రాక్‌లకు నిధుల ఊసే లేదని విమర్శించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొన్ని రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించారని తెలిపారు.

**ఎరువుల సబ్సిడీ నిధుల్లో కోత**

రూ.50,65,345 కోట్లతో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రూ.12,76,338 కోట్లు, అంటే 25.2 శాతం వడ్డీల చెల్లింపునకే కేటాయించారని సీపీఎం నేత జాన్‌వెస్లీ వివరించారు. వ్యవసాయ రంగానికి గతం కన్నా రూ.10 వేల కోట్లు తగ్గించారని తెలిపారు. ఎరువుల సబ్సిడీకి రూ.11 వేల కోట్లు కోత విధించారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ దేశంలో రూ.25 కోట్ల మందిని దారిద్ర్యరేఖకు ఎగువకు తెచ్చామని చెప్తూనే 2029 వరకు 80 కోట్ల మందికి ఐదు కిలోల చొప్పున రేషన్ షాపుల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చేస్తామన్నారని గుర్తు చేశారు.

**ఉపాధి హామీకి నిధులేవీ**

ఉపాధి హామీ చట్టానికి 202324లో రూ.89,154 కోట్లు ఖర్చు చేయగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. దళిత, గిరిజనులకు బడ్జెట్, సబ్‌ప్లాన్ కింద చేసిన కేటాయింపులు ఆ వర్గాల అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడడం లేదని పేర్కొన్నారు. ఈ వర్గాలకు కేటాయించిన నిధులను నోడల్ ఆఫీసర్ ద్వారా ఆవాసాలు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలు కల్పిస్తే ఆ వర్గాల్లో కొంతమేరకైనా అభివృద్ధి జరుగుతుందని వివరించారు. దళితులకు 16 శాతం కేటాయించాల్సి ఉండగా, ఐదు శాతం నిధులు మాత్రమే కేటాయించారని విమర్శించారు. గిరిజనులకు ఏడు శాతం నిధులు కేటాయింపునకు బదులు రెండు శాతం కేటాయించారని తెలిపారు.

**విద్య, వైద్య రంగాలకు అంతంత మాత్రమే**

విద్య, వైద్య రంగాలకు చాలా స్వల్పంగా కేటాయింపులు మూడు శాతంలోపే కేటాయింపులున్నాయని పేర్కొన్నారు. పారిశ్రామిక రంగం ఉత్పత్తికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు పన్ను రాయితీలు, బ్యాంకుల అప్పుల ఎగవేతకు అవకాశం కల్పిస్తూ తయారుచేసిన ఈ బడ్జెట్‌ను పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధికి అనుకూలంగా తీర్చిదిద్దాలని కోరారు. వలసలను, ఆత్మహత్యలను నిరోధించే విధంగా బడ్జెట్‌ను రూపొందించాలని తెలిపారు. జరిగి కనీసం 30 మంది మరణించిన కొన్ని రోజుల తరువాత జరుగుతున్న ఈ మూడోవ అమృత స్నానానికి.. యూపీ అధికారులు అత్యంత కట్టుదిట్ట భద్రతను ఏర్పాటు చేశారు. ప్రమాద రహిత కార్యక్రమం నిర్వహించేందుకు అఖాడాలతో చర్చలు జరిపి కుంభమేళా నిర్వాహకులు.. పవిత్ర వసంత పంచమి రోజున చేపట్టే అమృత స్నానాల షెడ్యూల్‌ను నిర్ణయించారు. ప్రతి అఖాడాకు పవిత్ర జలాల వద్ద 40 నిమిషాల సమయాన్ని కేటాయించారు. మొదటి ఊరేగింపుతో వెళ్లేవారు వారి పనులు ముగించుకుని ఉదయం 8.30 గంటలకు వారి శిబిరాలకు తిరిగి వెళ్లే విధంగా ప్లాన్ చేశారు.

ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా నగర్‌లోని సంగం వద్ద పోలీసులు గట్టి నిఘా ఉంచిన నేపథ్యంలో మహానిర్వాణి, అటల్ అఖాడాలు ఉదయం 4 గంటలకే స్నానఘట్టాలకు బయలుదేరారు. సాధువులు ఊరేగింపుగా వెళ్లి పవిత్ర స్నానాలు ఆచరించి సోమవారం మధ్యాహ్నం 3 గంటల 55 నిమిషాలలోపు తిరిగి వెళ్లిపోవాలని అధికారులు సూచించారు. వారు వెళ్లిన తర్వాత సాధారణ ప్రజలకు పవిత్ర స్నానాలు చేసే అవకాశాన్ని కల్పిస్తారు. మహా కుంభమేళా 2025 మూడొవ 'అమృత స్నానం' కోసం 'మహామండలేశ్వర్లు' లేదా వివిధ అఖాడాల అధిపతులు ఊరేగింపులకు నాయకత్వం వహిస్తున్న దృశ్యాలు కనిపించాయి. తెల్లవారే సమయానికి వివిధ అఖాడాల నుంచి బూడిద పూసిన నాగసాధువులు త్రివేణి సంగమం వైపు తమ ఉత్సవ ప్రయాణాన్ని ప్రారంభించారు.

**వసంత పంచమి అమృత స్నాన్నాల షెడ్యూల్..**

'మౌని అమావాస్య' రోజున గతంలో జరిగిన 'అమృత స్నానం' సందర్భంగా సంగం వద్ద జరిగిన తొక్కిసలాటలో కనీసం 30 మంది మరణించగా, 60 మంది గాయపడిన నేపథ్యంలో వసంత్ పంచమి పవిత్ర స్నానానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఎక్కువగా ఉందని పలువురు నమ్ముతున్న సంగం వద్దే గతంలో తొక్కిసలాట జరిగింది. అయితే అలాంటిదేమీ లేదని, ఎక్కడైనా పవిత్ర స్నానాలు చేయవచ్చని భక్తులకు సాధువులు, యూపీ అధికారులు అభ్యర్థిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయానికి 16.58 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని, జనవరి 13 నుంచి స్నానమాచరించిన వారి సంఖ్య 34.97 కోట్లకు చేరుకుందని సమాచార సంచాలకుడు శిశిర్ తెలిపారు.

వీరిలో 10 లక్షల మంది కల్పవాసీలు, 6.58 లక్షల మంది యాత్రికులు ఉన్నారని వివరించారు. ఇప్పటివరకు 33 కోట్ల మంది భక్తులు మహా కుంభమేళాలో స్నానమాచరించారని, సోమవారం ఒక్కరోజే సుమారు ఐదు కోట్ల మంది యాత్రికులు వస్తారని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది. మౌని అమావాస్య తర్వాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భద్రత, క్రౌడ్ మేనేజ్‌మెంట్ చర్యలను కట్టుదిట్టం చేసింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శనివారం స్వయంగా ఏర్పాట్లను పరిశీలించడంతో సోమవారం 'జీరో ఎర్రర్' అమృత్ స్నాన్ కోసం అదనపు సిబ్బంది, వైద్య సిబ్బంది, వనరులను మోహరించారు.

# డ్రగ్స్ బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు

- గంజాయి ముఠాలను డేగలా వేటాడుతోంది ఈగల్ టీం
- ఏపీని వైసీపీ గంజాయి మయంగా మార్చేంది
- వీ వైబ్ 10కే రన్ లో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి
- 10కే రన్ లో శాప్ ఛైర్మన్ రవినాయుడు, అహుడా ఛైర్మన్ వరణ్
- కూటమి వచ్చిన ఆరు నెలల్లోనే గంజాయిని కట్టడి చేశాం.. ఎమ్మెల్యే దగ్గుపాటి
- జిల్లాను క్రీడా హబ్ గా మారుస్తాం.. శాప్ ఛైర్మన్ రవినాయుడు
- డ్రగ్స్ నిర్మూలనపై పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు.. అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్



**జయభేరి, అనంతపురం :**

గతంలో ఎక్కడ డ్రగ్స్ దొరికినా దాని మూలాలు ఏపీలోనే ఉండేవని.. కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిని పూర్తిగా కట్టడి చేశామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సే నో టూ డ్రగ్స్ నినాదంతో అనంతపురం కోసం పరుగు పేరుతో ఆదివారం నగరంలో 10కే రన్ నిర్వహించారు. వీ వైబ్ అధినేత్రి రాధా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాప్ ఛైర్మన్ రవినాయుడు, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ లు హాజరయ్యారు. కలెక్టరేట్ వద్ద ఈ రన్ ను శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే దగ్గుపాటి, టీసీ వరుణ్ ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ బృందంతో వందల సంఖ్యలో యువత ఈ రన్ లో పాల్గొన్నారు. సే నోటూ డ్రగ్స్ నినాదాలు చేస్తూ ఈ పరుగు సాగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఏ కళాశాలలో చూసినా డ్రగ్స్ దొరికేదని రాష్ట్రాన్ని గంజాయి మయంగా మార్చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిని పూర్తిగా అరికట్టామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో పోలీసులు ఈగల్ టీం పేరుతో గంజాయి ముఠాలను డేగలా వెంటాడుతున్నారన్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ అనంతపురంలో డ్రగ్స్ మహమ్మారిని నియంత్రించాలన్నారు. డ్రగ్స్, గంజాయి కట్టడికి అనంతపురం యువత పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. డ్రగ్స్ నియంత్రణకు క్రీడలు దోహదపడుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతపురం జిల్లాను క్రీడా హబ్ గా మారుస్తామని రవినాయుడు అన్నారు. డ్రగ్స్ కట్టడికి కృషి చేస్తున్న వీ వైబ్ నిర్వాహకుల సేవలు అభినందనీయని గంజాయి కట్టడికి అనంతపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కృషి చేస్తుందని అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా డ్రగ్స్ నియంత్రణ పై ప్రత్యేకంగా దృష్టిసారించారన్నారు. ఈ కార్యక్రమంలో నార్కో టీం సభ్యులు, వి వైబ్ ప్రతినిధులు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, పద్మశాలి ఫెడరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, రజక ఫెడరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, రాయలసీమ బలిజ సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు తొండపునాటి రమేష్, దత్తాత్రేయ ఆలయ కమిటీ చైర్మన్, టిడిపి నాయకుడు రాయల్ మధు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, టిడిపి బీసీ సెల్ నాయకుడు జోగి రాజేంద్ర, తెలుగుయువత నగర ప్రధాన కార్యదర్శి బొమ్మినేని శివ, తెలుగు మహిళ నాయకురాళ్ళు చరిత, మంజుల, తెలుగుదేశం పార్టీ నాయకులు ధరూర్ ఓబుల నాయుడు, బెస్త అంజి, జయరాం నాయక్, పోతులయ్య, వేలూరు మారుతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.









# బడేబాయ్ చోటే బాయ్ దోనో ఏకీ హై

- మాజీ ఎఫ్ డిసి వంటేరు ప్రతాపరెడ్డి

**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 02 :**

బడేబాయి నరేంద్ర మోడీ చోటే భాయ్ రేవంత్ రెడ్డి ఇద్దరు కలిసి తెలంగాణ రాష్ట్రాన్ని ద్రోహం చేశారు మోసం చేశారు.గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి. గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ నిన్న పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఒక్క రూపాయి కూడా బడ్జెట్లో కేటాయించకపోవడం చాలా బాధాకరమని తెలంగాణపై సవతి తల్లి ప్రేమను కూడా నరేంద్ర మోడీ చూపెట్టడం లేదని వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్రం నుండి 8 మంది బిజెపి ఎంపీలు, 8 కాంగ్రెస్ ఎంపీలు ఒకటి ఎంఐఎం పార్టీ ఎంపీలు ఉన్న తెలంగాణ రాష్ట్రానికి గుండు సున్నా బడ్జెట్ కేటాయించకపోవడం కాంగ్రెస్ బిజెపి ఎంఐఎం పార్టీల కుమ్మక్కు రాజకీయాలకు , మూడు పార్టీల అసమర్థ నాయకత్వానికి నిదర్శనం అన్నారు.కేంద్రంలో ఉండే బడే భాయ్ రాష్ట్రంలోని జీఎస్టీ ద్వారా దర్జాగా వసూలైన నిధులను తమ సొంత రాష్ట్రాలకు కేటాయించడం, అలాగే రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చోటే భాయ్ రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర రాబడిని ఢిల్లీలోని వాసులకు మూటలు పంపడం తో తెలంగాణ రాష్ట్రం దివాల అంచుల్లోకి వెళ్లిందని ప్రతాప్ రెడ్డి అన్నారు.బడే బాయ్ చోటే బాయ్ కలిసి తెలంగాణ రాష్ట్రాన్ని, దోచుకుంటున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని దేనికోసం 30 సార్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని మంత్రి నరేంద్ర మోడీని ఎందుకు కలిశారో తెలపాలని ఏ సెటిల్మెంట్లు ఇద్దరు కలిసి చేసుకున్నారు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు చెప్పాలని వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు.కనీసం తెలంగాణ రాష్ట్రానికి రావలసిన నిధులను రాబట్టడంలో, తెలంగాణ రాష్ట్ర అసమర్థ బీజేపీ ఎంపీలు, కాంగ్రెస్ ఎంఐఎం ఎంపీలు విఫలమయ్యారని వంటేరు ప్రతాపరెడ్డి తెలిపారు.బిఆర్ఎస్ పార్టీ , పార్లమెంటులో బి ఆర్ ఎస్ గళం లేని లోటు తెలంగాణ, రాష్ట్రంలో కనిపిస్తుందని ప్రజలలో ఆవేదన మొదలైందని అన్నారు, కేవలం బిజెపి కాంగ్రెస్ ఎంఐఎం మతపిచ్చి రాజకీయాలతో పబ్బం గడుపుతున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రజలను రాష్ట్ర రైతాంగాన్ని సబ్బండ వర్గాలను గాలికి వదిలేసారని అన్నారు.కేంద్రంలోని బిజెపి సర్కార్ నరేంద్ర మోడీకి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం పట్టదని తెలంగాణ రాష్ట్ర రైతుల సమస్యలు పట్టదాని తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని ఆదాయాన్ని అదాని అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ బడే బాయ్ చోటే బాయ్ కమిషన్లు దండుకుంటున్నారని వంటేరు ప్రతాప్ రెడ్డి తెలిపారు.

# తెలంగాణ కు తీరని అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

- ప్రవేశ పెట్టిన ఆర్థిక బడ్జెట్ రాజకీయ బడ్జెట్
- రాష్ట్రం నుండి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు పార్లమెంటు సభ్యులు ఉన్నా శూన్యం
- ఐటిఐఆర్ సంస్థకు ప్రాధాన్యత కల్పించకపోవడం బాధాకరం
- కెసిఆర్ ను నమ్మి 3 సార్లు గెలిపిస్తే గజ్వేల్ నియోజకవర్గం ప్రజలను మోసం చేశారు
- రెండుసార్లు అధికారంలో ఉండి ఏ ఒక్క భూ నిర్వాసితులకు కేసీఆర్ న్యాయం చేశాడా
- ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్



**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 02 :**

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్ రాజకీయ బడ్జెట్ గా పరిగణిస్తున్నామని గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ పేర్కొన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టేముందు ఎన్నికలు ఎక్కడ జరిగితే ఆ రాష్ట్రానికి పెద్ద పీట వేస్తున్నారు. కాంగ్రెస్ పరిపాలిస్తున్న రాష్ట్రాల్లో బిజెపి సర్కార్ బడ్జెట్ లో మొండి చేయి చూపిస్తూ ప్రవేశపెడుతున్నారని విమర్శించారు. గజ్వేల్ పట్టణంలో ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విభజన చట్టాన్ని అమలు చేయకుండా ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించడం లేదని, రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు పార్లమెంటు సభ్యులు ఉన్నా కూడా రాష్ట్రంలోని ఐటిఐఆర్ సంస్థకు ప్రాధాన్యత కల్పించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ ను నమ్మి 3 సార్లు గెలిపిస్తే ఇచ్చిన మాట మీద నిలబడకుండా గజ్వేల్ నియోజకవర్గం ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. రెండుసార్లు అధికారంలో ఉండి ఏ ఒక్క భూ నిర్వాసితులకు కేసీఆర్ న్యాయం చేశాడా అని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తున్నారని రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి కి దక్కుతుందని అన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్క పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేసీఆర్ ఇచ్చాడా అని ప్రశ్నించారు. అధికారం కోల్పోయిన అసహనంలో ఉన్న కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం పై వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఏడాది నుంచి ఫామ్ హౌస్ లో పండుకున్న కేసీఆర్ అధికారం కోసం పాకులాడం తప్ప ఆయన ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పడం కాదు మీ పాలనలో ప్రజలు ఏ ఒక్కరు కూడా సంతృప్తిగా లేరని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వాల్ పోస్టర్ విడుదల చేసిన ఎంఈఎఫ్ నాయకులు

- వెయ్యి గొంతులు లక్ష డప్పుల ప్రదర్శన వాల్ పోస్టర్స్ ను విడుదల
- ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చేపర్తి యాదగిరి




**జయభేరి, వర్ధల్, జనవరి 02 :**

కోట్లాది మంది ప్రజల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు వేల గొంతుల్లో భాగంగా పద్మశ్రీ గ్రహీత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం అధ్యక్షుడు డప్పు యాదగిరి ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో వర్గల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 7న పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేపట్టిన వెయ్యి గొంతులు లక్ష డప్పుల సాంస్కృతిక మహా ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గ్రామం లోని మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజాస్వామిక వాదులు మనిషికో డప్పు ఊరికో బస్సు సద్దిగట్టుకొని పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వర్గల్ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ పక్షాన పిలుపునివ్వడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి అయ్యగాల పోచయ్య, మాజీ ఎంపీటీసీ భాగనోళ్ల స్వాతి, స్వామి జిల్లా నాయకులు డ్యాగ నవీన్, మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షుడు పసులపల్లి నవీన్ కుమార్,ఉపాధ్యక్షులు అంకణి పోచయ్య మండల కమిటీ నాయకులు మారిగల ప్రవీణ్, కొండగళ్ల సహదేవ్, తునికి గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు ప్రశాంత్, గణేష్, షేర్ పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు గొలనకొండ శ్రీకాంత్, కోశాధికారి నరేష్, మీనాజీపేట్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్డేపల్లి రాజు ప్రధాన కార్యదర్శి రామని చరణ్ కార్యవర్గ సభ్యుడు సతీష్, మజీర్ పల్లి కమిటీ అధ్యక్షుడు గోశిక వెంకట్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పాల్గొనడం జరిగింది.



# నూతన దంపతులను ఆశీర్వదించిన కట్కూరి

**జయభేరి, పరకాల ఫిబ్రవరి 02:**

పరకాల పట్టణ కాంగ్రెస్ నాయకులు ధర్మల శ్రీనివాస్ (xరే శ్రీను)రమాదేవి దంపతుల ఏకైక పుత్రిక రాఘవవర్ధిని(ధరణి)రాజేష్ ల వివాహం కన్వెన్షన్ హాల్లో జరిగింది. నూతన దంపతులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి, రాయపర్తి గ్రామ మాజీ ఎంపీటీసీ పర్నేం మల్లారెడ్డి, మల్లక్కపేట మాజీ సర్పంచ్ అల్లం రఘునారాయణ, పరకాల మండల ఎస్సీ విభాగం అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి, పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి పబ్బా శ్రీనివాస్, మైనార్టీ సెల్ మాజీ పట్టణ అధ్యక్షులు ఎండి అలీ, కాంగ్రెస్ నాయకులు ఉడుత సంపత్, ఏకు రవికుమార్ మడికొండ సంపత్ లు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# పరామర్శించిన సోదా రామకృష్ణ



**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 02:**

ఆదివారం పరకాల మున్సిపల్ 18వ వార్డ్ పరిధిలోని మున్సిపల్ సఫాయి కార్మికుడైన పసుల సారయ్య సతీమణి పసుల రాధమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను, కుమారుడైన కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుల శ్రీనివాస్ లను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్ ఏకు రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి సదానందం గౌడ్, ఒంటేరు రమేష్, ఒంటేరు సురేష్ మెకానిక్ ఒంటేరు రాజు, ఏకు ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో గేదె మృతి



**జయభేరి, హసన్ పర్తి, ఫిబ్రవరి 02:**

అర్వపల్లి గ్రామం, మండలం హసన్ పర్తి, జి.హనంకొండ గ్రామం శివారులోని కడారి శ్రీపాల్ /పోశయ్యా యొక్క గేదె సుమారు 80.000/90.000 రూ. విలువగల గేదె, రోజూ వారి ప్రకారం మేతకు వెళ్లి మేస్తూ పంట కాలువ నీరు త్రాగడానికి వెళ్లి నీరు త్రాగుతుండగా ప్రమాదంస్తూ విద్యుత్ షాక్ కు గురై చనిపోవడం జరిగింది. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితుడికి నష్టం పరిహారం ఇప్పించాలని అలాగే వారి కుటుంబాన్ని ఆదుకోవాలని బిఆర్ఎస్ పార్టీ హసన్ పర్తి మండల అధ్యక్షుడు బండి రాజినికుమార్ బిఆర్ఎస్ నాయకుడు జెట్టి రాజేందర్ కోరడం జరిగింది.

# కొమ్మాల లో ప్రత్యేక పూజలు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 02:**

ఆదివారం గీసుగొండ మండలం కొమ్మాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలను నిర్వహించారు. పరకాల నియోజకవర్గ ప్రజల పైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు. అనంతరం ఆలయ చుట్టు పరిసరాలను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించి, రానున్న జాతర ఏర్పాట్ల పై సమీక్షించారు.

# లయన్స్ క్లబ్ రీజియన్ సమావేశం




**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 02 :**

గజ్వేల్ లో ఆదివారం ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో లైన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గోలి సంతోష్ అధ్యక్షతన లయన్స్ క్లబ్ 320 డీ రీజియన్ సమావేశం ఏర్పాటు చేశారు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన లయన్స్ క్లబ్ సభ్యులకు సన్మానం చేశారు అలాగే వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపిక అందజేశారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ ఎన్ సి రాజమౌళి, డిస్టిక్ 320 డీ గవర్నర్ నగేష్ పంపాటి, లయన్స్ క్లబ్ ప్రముఖులు మాట్లాడుతూ, లయన్ గోలి సంతోష్ సేవలు అభినందనీయమని, వ్యాపారంలో రాణిస్తూ సేవా కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉంటూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రీజియన్ చైర్మన్ గా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రీజియన్ సమావేశం ఘనంగా నిర్వహించడం అభినందనీయమని సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ అని లయన్స్ క్లబ్ సభ్యులను అభినందించారు, ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి అండగా చిన్ననాటి స్నేహితులు

**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 2 :**

గత నెల రోజుల క్రితం గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన పరికి సుమన్ అనే యువకుడు కుటుంబ సమస్యలతో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నారు అతని కుటుంబ పరిస్థితులు బాగు లేకపోవడంతో తనతో పాటు చదువుకున్న స్నేహితులంతా కలిసి ఆదివారం మృతుని కుటుంబాని పరమర్శించి తన పదవ తరగతి పూర్వపు విద్యార్థులు 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనతో చదువుకున్న తన స్నేహితుడు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు తన కుటుంబానికి ఎల్లప్పుడూ చేదోడువాదారుగా ఉంటామని పేర్కొన్నారు ప్రభుత్వం సైతం సుమన్ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు ఎల్కంటి సురేష్, పిట్ల నరేష్, పుల్లా సతీష్, బాకీ కృష్ణ, వాసరి రాజు, డాకిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, పిట్ల రాము, రాచమల్ల సుధాకర్, టంగుటూరి బాలరాజ్, డప్పు కరుణాకర్ లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు


- అమలవుతున్న పథకాలను చూసి జీర్ణించుకోలేని బిఆర్ఎస్ నేతలు



**జయభేరి, ములుగు, జనవరి 02 :**

కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు.ములుగుకు చెందిన కుతాడి కనకయ్య , శ్రీనివాస్ ల తల్లి ఇటీవల మరణించడంతో ఆయన వారి కుటుంబ సభ్యులను ఆదివారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా భారాసకు చెందిన పలువురు యువకులు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. నిరుపేద వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. త్వరలోనే అన్ని పథకాలను పేదలకు అందించడం జరుగుతుందన్నారు. కార్యకర్తలందరూ పార్టీ అభివృద్ధి కోసం కలసికట్టుగా కృషి చేయాలని, పథకాలను అర్హులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, గణేష్, కిష్టారెడ్డి, ప్రభాకర్ గుప్తా, కరుణాకర్ గౌడ్, రవీందర్ రెడ్డి, స్వదేశ్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి జగదీష్ రెడ్డి దంపతులు




**జయభేరి, దేవరకొండ :**

మాజీ చింతపల్లి జెడ్పిటిసి కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి గార్ల కూతురు కంకణాల సౌమ్య అనిల్ వెంకట్ రెడ్డి గార్ల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి తో కలిసి ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ దేవరకొండ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు ఆశీర్వదించినారు.

## షావలి దర్గ గంధం కార్యక్రమం

- బిఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్



**జయభేరి, దేవరకొండ :**

పట్టణం ఇస్లాం పుర లో ఉన్న దర్గ లో గంధం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ముస్లిం పెద్దలు బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ ని శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు యువకులు పాల్గొన్నరు.

## అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం ఆర్థిక సహాయం

- బిఆర్ ఎస్ పార్టీ యువ నాయకులు రామావత్ లక్ష్మీపతి రాథోడ్

**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలం చందంపేట గ్రామ పంచాయతీ చెందిన అంబేద్కర్అసోసియేషన్ సభ్యులు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం అడగగానే వెంటనే స్పందించి 65000/ఆర్థిక సహాయం చేసిన బి ఆర్ ఎస్ పార్టీ యువ నాయకులు రామావత్ లక్ష్మీపతి రాథోడ్ విగ్రహం ఏర్పాటు కోసం కృషి చేసిన లక్ష్మీపతి రాథోడ్ ని ఘనంగా సన్మానించిన అంబేద్కర్ అసోసియేషన్ సభ్యులు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ కొండమల్లేపల్లి యూత్ అధ్యక్షులు మాజీ ఉప సర్పంచ్ రామావత్ తులసీరాం నాయక్, శ్రీరామ్,హాజ్య,నాగు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అక్షర జ్ఞానాన్ని ప్రసాదించే అమ్మవారు సిద్ధం

- విద్యాధరి లో నేడు వసంత పంచమి మహోత్సవం
- వర్గల్ ఆలయం సర్వాంగ సుందరంగా కొండపైన ఆకట్టుకునేలా వీణాపాణి విగ్రహం
- భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ
- గజ్వెల్ ఏసీపీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు





**జయభేరి, వర్గల్, ఫిబ్రవరి 02 :**

అక్షరాభ్యాస కేంద్రం.. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం.. మహిమాన్విత క్షేత్రంగా సిద్దిపేట జిల్లా వర్గల్ శంభుని కొండపై కొలువు దీరిన శ్రీవిద్యా సరస్వతీ దేవి సన్నిధానం వసంత పంచమి మహోత్సవ సంబరాలకు ముస్తాబైంది. విశేష భక్త జనాదరణతో రెండో బాసరగా వినతికెక్కిన ఈ క్షేత్రం విద్యుద్దీపాలంకరణలతో కాంతులీనుతున్నది.

9 అక్షరాభ్యాస మండపం వద్ద అమ్మవారిని వివిధ రూపాల్లో విద్యుద్దీపాలతో అలకరించారు. వసంత పంచమి సందర్భంగా సోమవారం వర్గల్ క్షేత్రానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉండడంతో ఏసీపీ పురుషోత్తంరెడ్డి భారీ బందోబస్తును ఏర్పాట్లు చేశారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

వసంత పంచమి మహోత్సవం కోసం వర్గల్ శ్రీవిద్యా సర స్వతి క్షేత్రం ముస్తాబైంది. విద్యుద్దీపాలంకరణతో క్షేత్రం కాంతులీనుతున్నది. సోమవారం వసంత పంచమిని పుర స్కరించుకొని క్షేత్రాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. అక్షరాభ్యాస మండపం వద్ద విద్యుత్ దీపాలను అమ్మవారి వివిధ అలంకారాల రూపంలో అమర్చారు. ప్రముఖ పం చాంగకర్త యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి సంకల్పం, సత్యపథం సేవాసమితి సహకారంతో 1989లో వసంత పంచమి రోజున ఆలయ నిర్మాణానికి అంకురార్పణ జ రిగింది. 1992లో పుష్పగిరి పీఠాధిపతి శ్రీవిద్యా నృసింహ్మ భారతి స్వామి వారు ఆలయంలో అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు.

నాటి నుంచి తేజోమయమైన అమ్మవారు తన చెంత చేరిన భక్తులను కటాక్షిస్తూ చిన్నారులకు అక్షర జ్ఞాన కాంతులు పంచుతూ భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగా రంగా విలసిల్లుతున్నది. విశేష భక్త జనాధరణతో రెండో బాసరగా వినతికెక్కింది.

### వసంత పంచమికి పటిష్ట బందోబస్తు..

వసంత పంచమి పురస్కరించుకొని వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. గురువారం ఆయన వర్గల్ క్షే త్రాన్ని సందర్శించారు. ఫిబ్రవరి 3న జరిగే మహోత్సవానికి ఏర్పాట్లను రూరల్ సీఐ మహేందర్రెడ్డి, గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి, ఆలయ మేనేజర్ రఘుపవన్ తో సమీక్షిం చారు. ప్రత్యేక దర్శనం, సాధారణ దర్శనం, పార్కింగ్ ప్రదేశాలు, సామూహిక అక్షరాభ్యాస మండపాలను, ప్రధాన ఆ లయంతోపాటు, ఇతర ఆలయాలను పరిశీలించారు. భక్తు ల రద్దీ దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి సూచిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే భక్తజనాదరణ కలిగిన వర్గల్ క్షేత్రానికి వసంత పంచమి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..!


- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలి
- టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు




**జయభేరి, కొండపాక, ఫిబ్రవరి 02 :**

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని, కంటికి రెప్పలా కాపాడుకుంటామని, ఎవరు నిరాశ చెందొద్దని, అభద్రత భావానికి గురి కావద్దని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొమ్ము విజయ్ కుమార్ అధ్యక్షతన కొండపాక మండలం దమ్మక్కపల్లిలో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి బండారు శ్రీకాంత్ రావు ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా సైనికుల పనిచేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇచ్చినా అందరూ ఐకమత్యంతో పనిచేసి కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలని సూచించారు.

పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికి అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు.



ఈ కార్యక్రంలో కాంగ్రెస్ పార్టీ ములుగు మండల అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, మనోహరాబాద్ మండల అధ్యక్షులు మల్లారెడ్డి, సీనియర్ నాయకులు సంతోష్, టీపీసీసీ రాష్ట్ర నాయకులు గోపాల్ రావు, తీగుల్ సర్పంచ్ కప్పర భాను ప్రకాష్ రావు, ఎన్ఎస్యూఐ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్ రాచకొండ, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అనీల్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సమీర్ ఇర్షాద్, అంకిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ నర్సింగారవు, గణపతిరెడ్డి, ఐఎన్టియుసీ జిల్లా అధ్యక్షులు రవీందర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఏర్పుల మల్లేశం, గజ్వేల్ పట్టణ సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ బాబా, మైనార్టీ సెల్ సీనియర్ నాయకులు మహమ్మద్ ఫరూక్ జానీ, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కుంచెం రవి, ఎన్ఈస్యుఐ జిల్లా కార్యదర్శి కొమ్ము భాను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వీరమోని హరివర్ధన్ గౌడ్ ని అభినందించిన పలువురు ప్రముఖులు

**జయభేరి, దేవరకొండ :**

విశాఖపట్నంలో జరిగిన నేషనల్ కరాటే పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన దేవరకొండ మున్సిపాలిటీ 18 వ వార్డు మాజీ కౌన్సిలర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీరమెని అంజి గౌడ్ తనయుడు హరివర్ధన్ గౌడ్ ని పలువురు ప్రముఖులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. మరిన్ని మెడల్స్ పొందాలని వారు అన్నారు. అభినందించిన వారిలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,మాజీ శాసన దేవరకొండ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్, బిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బిఆర్ఎస్వి దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు మహేష్ గౌడ్,బిఆర్ఎస్వీ మండల అధ్యక్షులు లక్ష్మణ్, బిఆర్ఎస్ పట్టణ యువజన విభాగం అధ్యక్షులు పొట్ట మధు, ముదిగొండ హరిదాస్,18వ వార్డు వాసులు తదితరులు ఉన్నారు.

# బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



- నామినేటెడ్ పదవులలో బీసీలకు తీవ్ర అన్యాయం
- సింగిల్ విండో ఎన్నికల్లోనూ రిజర్వేషన్లలో కల్పించాలి
- బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

**జయభేరి, దేవరకొండ :**

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆదివారం నల్గొండ జిల్లా దేవరకొండ పట్టణంలో బీసీ పొలిటికల్ జెఎసి యువజన విభాగం ఆధ్వర్యంలో క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాచాల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సమగ్ర కులగణన చేపట్టిందని, దాని ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవడానికి ఈనెల 5వ తేదీన అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీల హృదయాల్లో కాంగ్రెస్ పార్టీ సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకుంటదని ఆశిస్తున్నామన్నారు.నామినేటెడ్ పదవుల విషయంలో కూడా బీసీ నాయకులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఈ విషయంపై బీసీ ఎమ్మెల్యేలు కూడా మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. త్వరలో భర్తీ చేయనున్న ప్రభుత్వ పదవులలోనైనా బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డిని కోరారు.

సింగిల్ విండో ఎన్నికల్లో డైరెక్టర్లకు రిజర్వేషన్లు కల్పించిన ప్రభుత్వాలు అధ్యక్షులకు మాత్రం కల్పించలేదని, దీంతో రాష్ట్రమంతటా ఒకే సామాజిక వర్గం వారు ఆధిపత్యం చెలాయిస్తూ ఎస్సీ,ఎస్టి, బీసీలను రాజకీయంగా అణచివేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో నైనా సింగిల్ విండో ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగడంతో పాటు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.బీసీలను ఐక్యం చేసేందుకు త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీల చైతన్య యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ యువజన జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీష్ గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు తోటపల్లి మల్లేష్, నియోజకవర్గ అధ్యక్షుడు చిక్కొండ సాయిరాం కురుమ, బీసీ విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షులు సత్యం, నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టపల్లి అనిల్, దేవరకొండ మండల అధ్యక్షులు పోతురాజు ధనరాజ్ యాదవ్, కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు కలగోని రమేష్, చింతపల్లి మండల అధ్యక్షులు గజ్జ నాగరాజ గౌడ్, చందంపేట మండల అధ్యక్షులు జిల్లా శివప్రసాద్, నేరేడుగొమ్ము అధ్యక్షుడు హరీష్ యాదవ్, శ్రీరాములు, సిద్ధు, పచ్చిపాల మహేష్, ఆంజనేయులు, శివ, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావును కలిసిన బిఆర్ఎస్ నాయకుడు ముత్యాలు



**జయభేరి, డిండి :**

డిండి మండలంలోని వావిలికోల్ గ్రామ పరోధిలోని వడ్డెర గూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఓర్సు అంజయ్య కుమారుడు బిఆర్ఎస్ మండల నాయకులు ఓర్సు ముత్యాలు ఆదివారం హైదరాబాద్ లో మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును మర్యాద పూర్వకంగా కలిసిన ముత్యాలు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ డిండి మండలంలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలనీ రానున్న స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త విజయం కోసం అందరూ కలిసి చేయాలనీ సూచించినట్లు ముత్యాలు తెలిపారు.మళ్ళీ అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని కార్యకర్తలు మనోధైర్యాన్ని కోల్పోకుండా ఉండాలని పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని హరీష్ రావు సూచించారని తెలిపారు.




# అసలు మనం ఎక్కడున్నాం?

గత నెల 15న కేరళలో తోటి విద్యార్థుల వేధింపులు తట్టుకోలేక ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై సినీ సెలబ్రిటీలు కూడా స్పందిస్తున్నారు. తాజాగా సమంత ఈ విషాదంపై తన సోషల్ మీడియా ద్వారా స్పందించారు. 'తాము ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి బయటకు వెల్లడిస్తే ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందోననే భయంతో చాలామంది మౌనంగానే బాధపడుతున్నారు. నిజానికి మనం అక్కడే విఫలం అవుతున్నాం. బెదిరింపులు, వేధింపులు, అవమానకర చర్యలు ఎదురైతే, వాటి గురించి బయటకు వెల్లడించాలి. అప్పుడే సమాజం అండ లభిస్తుంది. అప్పుడే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడేవారిని మనం ఎదుర్కోగలం. అసలు మనం ఎక్కడున్నాం!?. సమాజం మానసికంగా ఎంతో ఎదుగుతున్నా కూడా కొందరు మాత్రం మనసుల్లో ద్వేషమనే విషాన్ని నింపుకొని బతుకుతున్నారు. అలాంటి వ్యక్తుల కారణంగా ఓ బాలుడు తన జీవితాన్ని అంతం చేసుకున్నాడు.



# అసలు మీ సమస్య ఏంటి?

టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డేకు కోపం వచ్చింది. ప్రస్తుతం బాలీవుడ్‌పై దృష్టి సారించిన ఈ అందాల భామ.. షాహిద్ కపూర్‌తో 'దేవా' అనే సినిమాలో నటించింది. ఇటీవలే ఆ సినిమా విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్‌లో విలేకరుల అడిగిన ప్రశ్నలు పూజాను అసహనానికి గురిచేశాయి. 'సల్మాన్, హృతిక్, రణ్‌వీర్, షాహిద్ వంటి స్టార్ హీరోల చిత్రాల్లో నటించడాన్ని మీరు అదృష్టంగా భావిస్తారా? అసలు అందుకు మీరు అర్హులేనా? అని విలేకరులు పూజాను ప్రశ్నించగా.. 'ఎస్.. అర్హురాలినే. ఒకవేళ అదృష్టం వల్లే నాకు అవకాశాలు వచ్చాయని మీరు అనుకుంటే.. నేను ఏమాత్రం బాధ పడను. ఏదైనా అవకాశం వచ్చినప్పుడు దానికి అనుగుణంగా సన్నద్ధమై పూర్తి స్థాయిలో ఆ పాత్రకు న్యాయం చేయాలి. అదే అదృష్టంగా భావిస్తా.' అని సమాధానమిచ్చింది పూజా. మీరు సినిమాలు ఎలా ఎంచుకుంటారు? స్టార్ హీరోల సినిమాలైతేనే చేస్తారా? అని మరో విలేకరి ప్రశ్నించగానే.. పూజా ఆగ్రహానికి గురైంది. 'అసలు మీ సమస్య ఏంటి?' అని ఎదురు ప్రశ్నించింది. వెంటనే పక్కనే ఉన్న షాహిద్ కపూర్ వాతావరణం వేడెక్కడాన్ని గమనించి తన జోకులతో చల్లపరిచే ప్రయత్నం చేశారు. ఏదేమైనా ఓ కథానాయికను అలాంటి ప్రశ్నలతో ఇబ్బంది పెట్టడం సబబు కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# ఈ సారి కూడా టైటిల్ మాదే

సెలబ్రిటీ క్రికెట్ లీగ్(CCL) 11వ సీజన్ ఫిబ్రవరి 8న బెంగళూరులో ప్రారంభం కానుంది. CCL నాలుగు సీజన్లలో వరుసగా తెలుగు వారియర్స్
ఛాంపియన్స్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఆ లెగసీని కొనసాగించేందుకు మరోమారు తెలుగు వారియర్స్ సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో
ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో తెలుగు వారియర్స్ జెర్సీని ఆవిష్కరించారు. టీమ్ కెప్టెన్ అఖిల్ అక్కినేని మాట్లాడుతూ
'సీసీఎల్ ఆడుతూ పెరిగా. ఇప్పటికి నాలుగు సార్లు టైటిల్ గెలిచాం. ఈ సారి కూడా టైటిల్ మాదే. ఎంటైర్టైన్ చేయాలనే పాషన్‌తో వస్తున్నాం. ఈ నెల
14, 15 తేదీల్లో ఉప్పల్ స్టేడియంలో ఆడుతున్నాం. వచ్చి సపోర్ట్ చేయండి' అని కోరారు. 'క్రికెట్ అనేది నా చైల్డ్‌వుడ్ డ్రీం. సీసీఎల్ ఫార్మాట్‌తో నా
కల నెరవేరింది. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ ఇందూరికి థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. దేశంలోని ప్రముఖ మైదానాల్లో క్రికెట్ అడటం అదృష్టం. అఖిల్
అగ్రెసివ్ కెప్టెన్. తన ఎత్తుగడలు బావుంటాయి. సచిన్‌జోషి ఈ టీమ్‌కి ఓనర్‌తోపాటు ఆటగాడు కూడా. క్రేజీ టీమ్‌తో వస్తున్నాం.. కప్ కొడతాం.' అని
ఎస్.ఎస్.తమన్ నమ్మకంగా చెప్పారు. అఖిల్ పాషనేట్ క్రికెటర్ అని, తమన్ టీమ్‌లో స్పిరిట్‌ని తీసుకొచ్చారని, సచిన్ జోషి చెప్పారు. ఇంకా అశ్విన్,
రఘు, ఆది, సామ్రాట్, సీసీఎల్ వ్యవస్థాపకుడు విష్ణువర్ధన్ ఇందూరి, రికా వ్యాలీ ఛైర్మన్ షోరబ్ అర్ఫాత్ కూడా మాట్లాడారు.




Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com